క్రమంగా ప్రతాప్ మరో విషయాన్ని గమనించగలిగాడు. సారాయి పట్టుకెళ్ళడాని కొచ్చే ఆడవాళ్ళతో చింతల్రావు ప్రవర్తన చాలా 'అతి'గా ఉంటుంది. ఆ 'అతి' అప్పుడప్పుడూ శ్రుతిమించుతూంటుంది. అలాంటి సందర్భాల్లో దించిన క ళ్ళెత్తకుండా తన పని తను చేసుకుపోతాడు ప్రతాప్.

మొదటి నెల జీతం అందుకున్న రోజు ప్రతాపరావు ఒక పండగే చెయ్యా లనుకున్నాడు ఇంట్లో. కాని, ప్రమీలకి రెండవసారి డెలివరీ కష్టమై హాస్పిటల్ ఖర్చుకి చేసిన అప్పూ, పెద్దాడి అనారోగ్యానికి చేసిన అప్పూ అతని ఉత్సాహాన్ని అణిచేశాయ్. అందుకే ఒక రూపాయి సంపెంగ పూలతో ప్రమీలతో ఆనందాన్ని పంచుకున్నాడు. ఆ పూలంటే ఆమెకు చాలా ఇష్టం.

3

ఆ రోజు ఎప్పట్లానే తెల్లవారింది. ఆకాశం మాత్రం అగ్నిపూల గుచ్ఛాల్ని మెడలో వేసుకున్నట్టుంది. పులి చంపిన లేడి నెత్తుర్ని ఒడలంత పూసుకున్నట్టుంది.

చంటాడు ఎందుకో ఒక్కసారిగా గుక్కపట్టి ఏడ్చాడు. ఉలిక్కిపడి లేచాడు ప్రతాప్. ఎదురింటి వాళ్ళ రేడియోలో సుప్రభాతం వీధంతా వినిపిస్తూ ఆ రోజు శనివారమని గుర్తు చేస్తోంది.

"ప్రమీ! ఆరు దాటిపోయిం దప్పుడే. లేవలేదేం?" పెరట్లోకి పరుగెడుతూనే అరిచాడు ప్రతాప్.

రాత్రి అత నింటి కొచ్చేసరికి ఒంటి గంటైంది. స్నానం చేసి, అన్నం తిని పడుకొనేసరికి రెండైంది. రా త్రెంత ఆలస్యమైనా ఉదయం ఆరు గంటలకి డిపోలో ఉండాలి. ఈ ఉద్యోగంలో చేరాక రాత్రి నిద్ర సరిపోక అతని కళ్ళకింద నల్లచార లొచ్చాయి. కళ్ళు లోపలికి గుంతలు పడ్డాయి.

అతను ముఖం కడుక్కొని వచ్చేసరికి పాలు సరిపోని నల్లటి కాఫీ అందించింది ప్రమీల. ఎప్పటి అలవాటు ప్రకారం సాసర్లోకి సగం కాఫీ పంచి ప్రమీల కందించాడు.

"మీరు తాగండి, నే నింట్లోనే ఉంటాను కదా!"

సమాధానం చెప్పలే దతను. రెండు గుక్కల్లో కప్పులోని కాఫీని ఖాళీ చేసి బట్ట లేసుకుని బయటికి నడిచా డతను పరుగులాంటి నడకతో. కారుల్లో తిరిగిన ఇతనికి కనీసం సైకిలైనా లేకుండా చేసింది తనే. మనసులో ఏం ఉంటుందో కాని, ఆనాటి వైభవాల గురించి తలచనైనా తలచ డతను.


ఆర్థికపరమైన ఇబ్బందులకి విసిగిపోయి ఎప్పుడైనా ఆ విసుగు తన మీద చూపిస్తాడేమో అని ఎదురు చూస్తుంది ప్రమీల. అలాగైలా తనకి కొంత మనశ్శాంతి లభిస్తుందని ఆశిస్తుంది. ఉహుఁ. అలాంటి భావావేశాలకి అతీతు డన్నట్టుంటా డతను. పెళ్ళికి ముందు అందర్లాంటి మనిషే అతను. చాలామంది లాగే చిన్న విషయాలకే స్పందించేవాడు. వా ళ్ళింట్లో అయిదోవాడూ, ఆఖరివాడూ కావడంతో తన మాటే నెగ్గించుకునే అలవా టుండే దతనికి. ఆ ధీమాతోనే ప్రమీలను పెళ్ళాడాడు.

పెళ్ళి దండల్తో ప్రమీలను తీసుకుని ఇంటి కెళ్ళిన అతనిని తండ్రి మెడ పుచ్చుకుని బయటికి గెంటాడు. ఇంగ్లీష్ లిటరేచర్‌తో ఎమ్మే తరువాత సివిల్ సర్వీసెస్ చేసి కలెక్టరై, మరో గొప్పింటి పిల్లతో బాటు కొన్ని కోట్లు కట్నంగా తెస్తా డనుకున్న కొడుకు ఇలా ఓ అనామకురాల్ని భార్యగా ఇంటికి తేవడాన్ని ఆయన సహించలేకపోయాడు.

డబ్బులో పుట్టిన కొడుకు ఆ డబ్బు లేకపోతే ఠారెత్తి, పారిపోయి వస్తాడని ఊహించా డాయన. కారు తాళాల్తో బాటు జేబులోని పర్స్ కూడా లాక్కున్నాడు. "నీ పేరుతో ఉన్న బాంక్ బేలన్సులన్నీ రద్దు చేస్తున్నాను. పోయి అడుక్కు తినరా రాస్కెల్" అని కొత్త పెళ్ళికూతురి ఎదుట అవమానించాడు.

ఆ సంఘటన ప్రతాప్ మీద చాలా ప్రభావం చూపించింది. తిరిగి తన ఇంటి ఛాయలకి గాని, తన వాళ్ళ దాపులకి గాని వెళ్ళలే దతను. తరచుగా గతం తన నిలా వేధిస్తుం దెందుకో అనుకుంటూ ఓ నిట్టూర్పు విడిచి, ఏడుస్తున్న చంటివాడిని చంక నేసుకుంది ప్రమీల. అది చూసి పెద్దవాడు ఏడుపు లంకించుకున్నాడు.

డిపో చేరుకున్న ప్రతాప్ తన సీట్లో కూర్చుని లెడ్జర్లు ముందుకు లాక్కున్నాడు. అప్పటికే జనం



డబ్బాల్లో క్యూలో నిలబడ్డారు.

"ఏంటన్నా ఇయ్యాల ఆలీసెం అయినాది?" అన్నాడు చిన్నిగాడు కాఫీ తెచ్చి టేబుల్‌మీద పెడుతూ.

చిన్నిగాడు కూడా డిపోలో వర్కరే. వర్కర్లందరికీ కాఫీ, మధ్యాహ్నం భోజనం హొటల్ నుంచి వచ్చేలా యజమాని ఏర్పాటు చేశాడు. అయిదు రూపాయల భోజనం కోసం వర్కర్ని ఇంటికి పంపిస్తే అయి దొండల బేరం పోతుందని అతని లెక్క.

చిన్నిగాడికి గోడౌన్ తాళా లిచ్చి కాఫీ కప్పు చేతిలోకి తీసుకున్నాడు ప్రతాప్. అంతలో పోలీస్ జీపొచ్చి డిపో ముందు రోడ్డుమీద ఆగింది. అలా పోలీస్ వాళ్ళూ, ఎక్సైజ్ వాళ్ళూ తరచుగా దాడి చెయ్యడం అలవాటే కాబట్టి, కప్పును టేబుల్ మీదుంచి, అలవాటు ప్రకారం లేచి నిలబడ్డాడు.

మొదట్లో కానిస్టేబుల్స్ ముందు అలా నిలబడడం చిన్నతనంగా ఉండే దతనికి. కాని, వాళ్ళ కోరచూపులూ, ఓరచూపులూ చూసి చిన్నిగాడు హెచ్చరించా డతన్ని - . "జాగర్త అన్నా! ఏదో ఒంకెట్టి లోపలికి తోసేగల్రు ఈ నా కొడుకులు" అని.

గవర్నమెంటు ఉద్యోగం అనే చిన్న అర్హతను వాళ్ళ నలా పైన నిలబెట్టిందనీ, డబ్బునే అస్త్రం ఉంటే వాళ్ళనే తన దగ్గర చేతులు కట్టి నిలబెట్టి ఉండేదనీ అర్థమైం దతనికి.

జీపులోంచి బిల బిల మంటూ దిగిన పోలీసులంతా డిపోకి ఎదురుగా ఉన్న పెంకుటింట్లోకి వెళ్ళడం చూసి తేలిగ్గా నిట్టూర్చి కాఫీ కప్పు చేతిలోకి తీసుకున్నా డతను.

ఈలోగా అక్కడున్న అందరి దృష్టీ ఎదురింటివైపు మళ్ళింది. రోడ్డున పోయే కొందరు ఆగి అటు చూడసాగారు. కొద్ది క్షణాల్లో ఆ ఇంటి ముం దొక గుంపు పోగైంది. చేతిలో పని వదిలేసి అటు పరుగెత్తిన చిన్నిగాడు గోడ క్కొట్టిన బంతిలా తిరిగొచ్చాడు. వగర్చుకుంటూ, గస పోసుకుంటూ "జనకలచ్చిమి నచ్చిపోనాది" అన్నాడు.

ప్రతాప్‌కి తాగుతున్న కాఫీ పొలమారింది. నిర్ఘాంతపోయి రెండు క్షణా లలాగే

## ఆంధ్రప్రభ
## సంక్రాంతి సంబరాలు


అప్పిచ్చువాడూ,
పుచ్చుకొనువాడూ వైద్యుడూ
వణిక్ప్రముఖుడూ - తెలుగు
వాడెవడయినా సరే పద్యం వాడి
అపూర్వ వారసత్వం.
'శ్రీరాముని దయచేతను' నాటి
నుండి నేటిదాకా చిరంజీవిగా
'ఎప్పుడు నెడ తెగక' ఏరై పారిన
మన పద్యం గురించి బాలబాలికల
కొక కలకండ తాయిలం శీర్షిక!

## 'మంచి పద్యం'

ఉండిపోయాడు.

అతని టేబుల్ కెదురుగా ఉన్న ఎదురింటి కిటికీలోంచి కాటుక మస్తుగా పూసుకున్న ఓ రెండు కళ్ళు తదేకంగా తననే చూస్తూ ఉండేవి. మొదట్లో గమనించలేదు కానీ, తర్వాత్తర్వాత ఆ దృశ్యం అతని దృష్టి పథాన్ని దాటిపోలేదు. వంచిన తల ఎత్తడం మానేశా డతను.

చిన్నిగా డిదంతా గమనించినట్టున్నాడు - ఓ రోజు భోజనాల టైంలో చెప్పాడు. ఎదురింటి పడుచు పేరు జనకలక్ష్మి అనీ, ఆవిడ తండ్రి ఆ గ్రామ సర్పంచ్‌కి బాకీ పడి అసలు - వడ్డీ కింద ఆవిణ్ణి సర్పంచికి ఉంపుడుకత్తెగా సమర్పించేసుకున్నాడనీ, అరవై ఏళ్ళ సర్పంచ్ ఆవిణ్ణి పంజరంలో చిలకలా బంధించి నానా హింసలూ పెడుతూ ఉంటాడనీ, చింతల్రావు దృష్టి ఆవిడ మీద పడిందనీ, అందుకే ఈ డిపోని తెచ్చి ఇక్కడ పెట్టాడనీ ఓ కథలాగా చెప్పాడు. ప్రతాప్ కిదంతా రుచించక ఏం కామెంట్ చెయ్యకుండా ఊరుకున్నాడు.




ఆ జనకలక్ష్మి ఇప్పు డిలా... ఏం జరిగుంటుందో అతని ఊహ కందలేదు.

'మన కెందుకులే' అని తన పనిలో లగ్నమైపోడానికి ప్రయత్నించాడు. కాని, ఆ కిటికీలో చేపల్లా తళ తళ లాడే రెండు సజీవమైన కళ్ళు శాశ్వతంగా మూతపడిపోయా యన్న సత్యం అతని గుండెని ముల్లులా గుచ్చుతోంది. అతనికి తెలీకుండానే రెండు కన్నీటి చుక్కలు కొలుకుల్లోకి చేరాయి. మనిషి బ్రతు కెంత అశాశ్వతం!

ఒక్కసారిగా పోలీసు బలగం సారాయి డిపోవైపు తరలి వచ్చింది. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోగా డిపోకి తాళాలు బిగించడం, ప్రతాప్‌ని, చిన్నిగాణ్ణీ, మరో ఇద్దరు పని కుర్రాళ్ళనీ అరెస్ట్ చేసి జీపు ఎక్కించడం జరిగిపోయాయి. దార్లో చింతల్రా వింటి ముందు జీపు ఆగింది. రెండు రోజులుగా అతను ఊళ్ళో లేడని ఆడవాళ్ళు సమాధానం చెప్పారు. ప్రతాప్ ఆశ్చర్యంగా చిన్నిగాడి ముఖంలోకి చూశాడు. వాడు ముఖం అటు తిప్పుకున్నాడు ఇవన్నీ మామూలే అన్నట్టు.

రాత్రి ఒంటిగంటకు డిపో మూసేసే వేళకి చింతల్రావు తాగుతూ వెనక గదిలో కూర్చుని ఉన్నాడు. ఇప్పు డతను రెండు రోజులుగా ఊళ్ళోనే లేడంటున్నారు. జరిగిందీ, జరగబోయేదీ చూచాయగా అర్థమైంది ప్రతాప్‌కి. లాకప్‌లో కూర్చున్న అతని మెదడు చురుకుగా ఆలోచిస్తోంది. జరుగుతున్నది మౌనంగా గమనిస్తూ కూర్చున్నాడు.

పది గంటల వేళ చింతల్రావు వచ్చాడు స్టేషనుకి. గుండు కొట్టించుకుని ఉన్నాడు. "తిరప తెల్లేనయ్యా యస్సైగారూ! ఇదిగో ప్రెసాదం. మా ఇంటి కొచ్చేరని తెలిసి ఎకాయెకిని ఇలా గొచ్చేసేను బండి దిగి. ఏసేలా గోరం జరిగిపోయింది" అంటున్నాడు.

అంతలో సర్పంచ్ ముత్యాల్రావుని సగౌరవంగా తోడుకొచ్చారు పోలీసులు. చింతల్రావు ఆయన కెదురెళ్ళి కావిలించుకున్నంత పని చేశాడు. యోగక్షేమా లడుక్కుంటూ ఇద్దరూ లోపలి కొచ్చారు.

"ఇలాంటి సందర్భంగా మిమ్మల్నిలా స్టేషనుకి రప్పించడం చాలా బాధ కలిగిస్తోంది నాకు" అంటూ అపాలజీ చెప్పుకున్నాడు యస్సై అరవిందరావు లేచి నిలబడి.

"దా న్దేపుందిలే, నీ డూటీ నువ్వు సెయ్యాల గదా!" అన్నాడు ముత్యాల్రావు దర్పంగా.

"రా త్రెక్కడున్నారో చెప్తారా దయచేసి" అడిగేడు యస్సై వీలైనంత వినయంగా.

"నిన్నంతా నే నూళ్ళో లేందే, పట్నా వెల్లేను పనుండి." ఫార్మాలిటీకి ప్రశ్న జవాబుల కార్యక్రమం ముగిశాక, ముగ్గురూ గుస గుస లాడుకున్నారు కొంతసేపు. ముత్యాల్రావు వెళ్ళిపోయాడు.

యస్సైతో మాట్లాడి ప్రతాప్‌ని బయట చెట్టు కిందికి పిల్చుకెళ్ళాడు చింతల్రావు - "పంతులూ! అంతా చూస్తున్నావు గందా, రాత్రి అనుకోని

సందర్భంలో సచ్చూరుకుందయ్యా ఆ జనకలచ్చిమి. ముత్తేల్రావు పక్కనే ఉన్నాడు. అనుమానం నీమీద కొచ్చీలాగ సిన్న కతల్లేం. ఎక్కువ సిచ్చపడకుండా చూసీ పూసీ నాది. వ దేలిత్తం. ఇబ్బందుల్లో ఉన్నోడివి. నో రిప్పకుండా ఉండంతే, నువ్వేం సెయ్యొద్దు'' అని గున గున లాడాడు చింతల్రావు.

''కాదూ కూడదూ అని నకరాలు జేసేవంటే ఉచ్చు బిగుసుకుపోయి ఉరిసి చ్చడిపోద్ది. నీ ఇష్టం మరి! కుర్రోళ్ళనీ, సిన్నిగాణ్ణీ ఇడిపించుకుపోత ను. అవత లాళ్ళు లేపోతే బిజినె స్సడిపోద్ది. నే సెప్పినట్టు సెయ్యి, ఏం?'' ప్రత ప్ సమాధానానికి నిరీక్షించకుండా వెళ్ళిపోయాడు చింతల్రావు.

ఆ సాయంత్రం ప్రమీల తండ్రిని తీసుకుని ప్రత ప్‌ని చూడడాని కొచ్చింది. ప్రమీల కళ్ళు మంకెన పువ్వుల్లా ఉన్నాయి. చెంపలమీంచి ధార కడుతున్న కన్నీటిని తుడుచుకోకుండానే అతను. చెప్పిందంత వింది. పల్లెటూళ్ళో పుట్టి, పెరగడంవలన అక్కడి రాజకీయాలూ, సామాజిక పరిస్థితుల మీద కొంత అవగాహ నుం దామెకి.

''నా దో చిన్న రిక్వెస్టు. ఇవాళో రేపో రిపోర్ట్ తయారుచేసి యస్సై మిమ్మల్ని సంతకం చెయ్యమంటాడు. ఆ పని మాత్రం చెయ్యకండి.''

''బావుంది, ఇది పోలీస్ స్టేషనని మరచిపోతున్నావ్! ఇక్కడ మన ఇష్టాయిష్టాలు చెల్లుత యా?''

''ప్లీజ్! ఒక్క నాలుగు రోజులు ఓపిక పట్టండి.''

''ఏం, మంత్రం ఏదైనా వెయ్యబోతున్నావా?'' నవ్వాడు ప్రత ప్.

''నా నమ్మకం వమ్ము కాకపోతే అలాంటిదే.'' కళ్ళు తుడుచుకుంది ప్రమీల.

## 4

మూడో రోజు ఎంక్వైరీ కోసం కలెక్టర్ స్వయంగా వచ్చా డా ఊరికి. జనకలక్ష్మి చేతి రాతతో ఉన్న ఉత్తరం ఒకటి ఆ రోజే ఆయనకి చేరింది. కొత్తగా ఉద్యోగంలో జాయినైన యువకుడు కాబట్టి పనిని వాయిదా వేసే అలవా టింకా రాలే దాయనకి. ఒక్క రోజు అలస్యమైనా ఒక నిరపరాధి శిక్షింపబడత డని వెంటనే బయలుదేరి వచ్చాడు.

ఆయన వచ్చాక క్షణాలమీద పనులు జరిగాయి. జనకలక్ష్మి పోస్టుమార్టం రిపోర్టు వచ్చింది. తాళం వేయబడిన జనకలక్ష్మి ఇంట్లో వెదికి ఆవిడ హాండ్ రైటింగ్‌తో ఉన్న కొన్ని ఉత్తరాలూ, కాయిత లూ సంపాదించుకొచ్చారు జవాన్లు. తన కొచ్చిన ఉత్తరంలోని కొక్కిరి బిక్కిరి రైటింగ్‌తో వాటిని సరిపోల్చి తృప్తిగా తల పంకించా డాయన. ఎందుకైనా మంచిదని, కూడా వచ్చిన రైటింగ్ నిపుణుడి చేతకూడా పరీక్ష చేయించారు. పన్లో పనిగా ప్రత ప్‌ని కొన్ని ప్రశ్న లడిగి సందేహ నివృత్తి చేసుకున్నారు. ఫ్లూయెంట్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతున్న ప్రత ప్‌ని చూసి ముచ్చటపడ్డా డా కలెక్టర్. ప్రత ప్‌ని చూస్తే గుడ్‌విల్ కలిగిం దాయనకి.

సంతకం పెట్టనందుకు రెండు రోజులుగా పోలీసులు పెడుతున్న చిత్రహింసల గురించి మాత్రం చెప్పలేదు ప్రత ప్. అతని కెందుకో ఈ వ్యవస్థమీదే జాలి కలుగుతోంది. సెల్ఫ్ పిటీ మాత్రం పనికిరాదని అతని ఉద్దేశం. పోలీసు రికార్డుల్లో పేరు నమోదు కాకుండానే బయటపడ్డాడు ప్రత ప్.

## 5

ఆ రాత్రి పిల్లల్ని మధ్యలో వేసుకుని అ టొకరూ, ఇ టొకరూ పడుకున్నారు ప్రమీలా, ప్రత పరావూ. ఆ మధ్యాహ్నం పోస్టులో వచ్చిన లెక్చరర్ పోస్ట్ త లూకు ఎపాయింట్‌మెంట్ ఆర్డరు తెచ్చిన ఆనందం ఇంకా వాళ్ళ కళ్ళలో తాండవిస్తూనే ఉంది.

''ప్రమీ! ఈ మూడేళ్ళుగా మన జీవితం ఎందు కిలాంటి ఒడిదుడుకులకి లోనయ్యిం దంటావ్?''

అతని గొంతులోని బరువుని గమనించి ప్రమీల చెయ్యి చాచి అతని జుట్టును సవరిస్తూ అంది - ''చెప్పనా? మన చదువులు పూర్తై లైఫ్‌లో సెటిల్ కాకుండానే పెళ్ళికి తొందరపడ్డాం. జీవిత న్ని ప్లాన్డ్‌గా తీర్చిదిద్దుకోకపోతే ఇలాంటివి తప్పవు.''

''ఆ విషయం అనుభవం మీద కదా తెలిసొచ్చింది. తలుచుకుంటే నా ఒళ్ళు జలదరిస్తోంది. ఈ సంఘటన ఇలా నాటకీయంగా ముగిసి ఉండకపోతే ఏమై పోయేవాళ్ళం?''

''... ... ...''

''అది సరే, ప్రమీ! ను వ్వేసిన మంత్రం ఏమిటో నా కిప్పటికీ అర్థం కాలేదు.''

''అర్థం కాకపోవడమే మంచిదిలెండి. ఎందుకంటే... నేను చేసింది నేరం.''

''సరిగ్గా చెప్పవోయ్!''

కొంతసేపు మౌనం వహించి - ''చెప్పడాని కేముందీ, జనకలక్ష్మి రైటింగ్‌ని అనుకరిస్తూ తనని చంపడానికి ముత్యాల్రావూ, చింతల్రావూ కలిసి ప్లాన్ చేస్తున్నారనీ, తనని రక్షించమనీ, పోలీసులు కూడా వాళ్ళ తరఫే కాబట్టి స్వయంగా వచ్చి రక్షించమనీ రాశాను. అదృష్టం కొద్దీ పోస్టల్ వాళ్ళు బాక్సుల్లోంచి ఉత్తరాలు రోజూ తీయ రిక్కడ. అందుకని డేట్ ఎంక్వైరీ వచ్చినా పర్వాలేదు.''

''జనకలక్ష్మి రైటింగ్ నీ కెలా తెలిసింది?''

''అది సస్పెన్స్.''

''చెప్పవోయ్, చంపక.''

''బుద్ధూ! జనకలక్ష్మి ఒకసారి చిన్నసైజు ప్రేమలే ఖొకటి మీ జేబులో పెట్టించింది - బహుశా చిన్నిగాడి చేతేమో. మర్నాడు ఆ షర్టు ఉతకడానికి తీసినప్పుడు నేను చూశాను.''

''నిజంగానా?'' ఆశ్చర్యపోయాడు ప్రత ప్. ''మరి నీకేం అనుమానం రాలేదా?''

''రాలేదు, రాదు. మీ గురించి పూర్తిగా నాకు తెలుసు కనక.''

''అయితే మొదట్నుంచీ నీకున్న బాపూ, జయదేవ్‌ల లాంటి వాళ్ళ రైటింగ్స్‌ని అనుకరించే అలవాటు ఇందుకు ఉపయోగపడిం దన్నమాట!''

''అవును. మిమ్మల్ని రక్షించుకోడానికి నే నీ రెండో తప్పు చేశాను.''

''మొదటి తప్పేవిటీ?''

''మిమ్మల్ని పెళ్ళాడ్డం.''

''ఏయ్, చిలిపీ.''

''నిజంగా ప్రత ప్! నా మూలంగానే...''

''నువ్వు చెప్పబోయే దేంటో నాకు తెలుసు. ధైర్యంతో పెళ్ళి చేసుకున్నాం. ఆ ధైర్యంతోనే కడకంటా కలిసి ఉందాం. నీమూలంగానే నాకు కష్టా లొచ్చాయని అనుకునే నువ్వు, నా మూలంగా నీకు కష్టాలని ఎందు కనుకోవు? నన్ను పెళ్ళాడకపోతే ఎమ్.ఏ. పూర్తి చేసేదానివి కదా! ఏ గొప్ప ఉద్యోగం చేసేదానివో ఎవరు చూడొచ్చారు?''

''సరే, ఆ మాటమీదే ఉండండి, ఎమ్మే పూర్తి చేసి గొప్ప ఉద్యోగంలో జాయి నవుత ను. ఓకేనా?''

''ఓకేనే. నీకోసం ఉద్యోగాలు క్యూలో ఉన్నట్టున్నాయి కదా!'' కళ్ళు చికిలించి చిలిపిగా చూస్తూ ప్రమీల చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు ప్రత ప్.

కాసేపటికి నిద్రలో ఉన్న పిల్ల లిద్దరూ ఓ పక్కా, దంపతు లిద్దరూ ఓ పక్కా ఉన్నారు. ★

